# మేడ్ ఫర్ ఈచ్ అదర్

సదానందం హడావుడిగా వచ్చాడు చేతిలో శుభలేఖతో. శుభలేఖ చాలా ఆధునికంగా, అందంగా ముద్రించాడు.

సదానందంలో ఒక తమాషా గుణం ఉంది. అతనికి ఎదుటివాళ్లు చెప్పే మాటలు వినడం కంటే తను మాట్లాడటమే చాలా ఇష్టం. విజయ్, సదానందం ఎంత స్నేహితులైనా విజయ్‌కి సదానందం మాటలు వినడమే అలవాటైంది కానీ, జవాబుగా ఊఁ, ఆఁ ఆఁ హాఁ- అనడం తప్పించి మాట్లాడాలన్న ధ్యాసే ఉండదు. శుభలేఖలో మరో విశేషమేమిటంటే అందులో వధూవరులిద్దరి ఫోటోలు కూడా వేశాడు చాలా చక్కగా, పెళ్ళికూతురి ఫొటో చూడగానే ఆమెను ఎక్కడో చూసినట్లు అనిపించింది. సదానందం మాటలు చెవులు వింటున్నా మనసు ఆలోచిస్తోంది.

"గురూ! వింటున్నావా?" అన్నాడు మధ్యలో ఓసారి విజయ్‌ని కుదుపుతూ.

"ఊఁ, ఊఁ" అన్నాడు విజయ్

"వసంత నాకు మొదటి చూపులోనే నచ్చింది. బి.ఏ. చదివింది. ఎంత వినయం, ఎంత విధేయత! పైగా ఈరోజుల్లో అమ్మాయిల్లా కాదు. మంచి క్యారెక్టర్. ఇన్ని రోజులుగా నేను ఈ అమ్మాయికోసమే పూజ చేస్తున్నానేమో, మేం ఇద్దరం ఒకరికోసం ఒకరం పుట్టామేమో అనిపిస్తోంది-

అదేరా మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా- ఫొటో చూశావుగా, ఎట్లా ఉంది? అయినా నిన్ను అడగడం నాది బుద్ధి తక్కువ నువ్వొట్టి శుద్ధ బుద్ధావతారానివని మరిచి పోతుంటా అప్పుడప్పుడూ ..." ప్రశ్న, సమాధానం అన్నీ తనే కలబోసుకున్నాడు సదానందం.

"సదానందం-కాస్త ఆపుతావా? ఎల్లుండి నీ పెళ్ళి అన్నావు. బాగుంది. మధ్యలో నాకు అక్షింతలు దేనికి?...." ఇంకా విజయ్ మాటలు సాగనిస్తే అవతలి శాల్తీ సదానందం ఎందుకవుతాడు?

"నాకు ఆనందంగా ఉందిరా, బ్రహ్మానందంగా ఉంది. నా ఆనందాన్ని నీతో కాక ఇంకెవరితో పంచుకుంటాను? అన్నట్లు చెప్పడం మరిచిపోయాను. నిన్న మేమిద్దరం షికారుగా "సినిమాకు వెళ్ళి హోటల్లో భోజనం కూడా చేశాం. నా మనసంతా ఇప్పుడు వసంతే నిండి ఉంది" అంటూ టైమ్ చూసుకొని "అమ్మో చాలా టైమైంది. ఇంకా చాలా మందికి శుభలేఖలు ఇవ్వాలి-ఇంతకీ పెళ్ళికూతురు బాగుంది కదూ? నా పెళ్ళికి తప్పక రావాలి సుమా! మరి నేవెళ్ళొస్తాను...." సదానందం మాటలు గడప ఇవతలకి వినబడుతున్నాయి. కానీ సదానందం గడప దాటేశాడు.

అప్పుడు గుర్తొచ్చింది విజయ్‌కి-ఓ రోజు రాత్రి స్నేహితుణ్ణి కలవడానికి వెంకటేశ్వరా లాడ్జికి వెళితే ఈ అమ్మాయి మరో అతనితో చెట్టా పట్టా లేసుకొని బయటికి వస్తోంది. అమ్మాయిలు నచ్చక చూసిన వరస పెళ్ళి చూపుల్లో కనీసం నూరో సంబంధం ఆయి ఉంటుంది. పాపం సదానందం!

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 30-7-86)